నమస్తే తెలంగాణ
జోగులాంబ గద్వాల వనపర్తి
5 | మహబూబ్‌నగర్, బుధవారం 21 మే 2025 | JOGULAMBA GADWAL WANAPARTHY

వనపర్తి జిల్లాలోని రేషన్ దుకాణంలో పంపిణీకి సిద్ధంగా ఉన్న బియ్యం (ఫైల్)

- రేషన్ షాపుల్లో ఒకేసారి మూడ్నెళ్ల బియ్యం
- ఆదేశాలు జారీ చేసిన కేంద్ర ప్రభుత్వం

ఇస్తారా.. మాయం చేస్తారా..?

బియ్యం పంపిణీపై రేషన్ కార్డుదారుల ఆందోళన

- ఇరుకు దుకాణాల్లో బియ్యం కోటా నిల్వకు ఇక్కట్లు
- ప్రత్యామ్నాయం చూసుకోవాలని డీలర్లకు అధికారుల సూచన

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, మే 20 : రేషన్ కార్డుదారులకు కేంద్ర ప్రభుత్వం తీపికబురు అందించింది. రాబోయే మూడు నెలలకు సంబంధించిన బియ్యం కోటా ఒకే నెలలోనే పంపిణీ చేయనున్నారు. ఇందుకు అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాలని కేంద్రం నుంచి ఆదేశాలు కూడా వచ్చాయి. ఇప్పటికే మే సరుకుల పంపిణీ ప్రక్రియ ముగిసింది. ఇక జూన్, జులై, ఆగస్టుకు సంబంధించిన కోటా కూడా ఈ నెలలోనే ఇచ్చేం దుకు సన్నాహాలు చేస్తున్నారు. ఏదైనా పరిస్థితుల్లో పాకిస్తాన్‌తో యుద్ధం వస్తే ప్రజలకు ఇబ్బంది కావొద్దనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తున్నది.

పంపిణీ సక్రమంగా సాగేనా..?

మూడు నెలలకు సంబంధించిన బియ్యం కోటా లబ్ధిదారులకు ఒకేసారి ఇవ్వాలని కేంద్రం ఆదేశాలు జారీ చేసింది. అయితే క్షేత్ర స్థాయిలో కార్డుదారులకు దీనిపై పెద్దగా అవగాహన లేదు. దీంతో అసలు బియ్యం పంపిణీ చేస్తారా..? మాయం చేస్తారా..? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ విషయంపై జిల్లా అధికారులు ప్రత్యేక దృష్టి కేంద్రీకరిస్తేనే ఫలితం దక్కుతుంది. అప్పుడే అర్హుల చెంతకు బియ్యం చేరే అవకాశం ఉన్నది. ఈ విషయమై పాలమూరు జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి శ్రీనివాస్ మాట్లాడుతూ కమిషనర్ నుంచి మౌఖికంగా ఆదేశాలు వచ్చాయని, అధికారిక ఉత్తర్వులు, మార్గదర్శకాలు అందాల్సి ఉన్నదని చెప్పారు.

రేషన్ కార్డులు, యూనిట్లు ఇలా..

పాలమూరు జిల్లాలో మొత్తం 2,44,541 రేషన్ కార్డులు ఉన్నాయి. వీటిలో ఏఎఫ్ఎస్‌సీ కార్డులు 19,029, ఎఫ్ఎస్‌సీ కార్డులు 2,25,312, ఏఏపీ కార్డులు 200 ఉన్నాయి. వీటి పరిధిలో ఏఎఫ్ఎస్‌సీ కార్డుల్లో 54,245 యూనిట్లు (కుటుంబ సభ్యులు) ఉండగా.. ఎఫ్ఎస్‌సీ కార్డుల్లో 7,63,513 యూనిట్లు, ఏఏపీ కార్డుల్లో 246 యూనిట్లు ఉన్నాయి. ఈ లెక్కన మొత్తం 8,18,004 యూనిట్లు ఉన్నాయి. బియ్యం కోటా ఏఎఫ్ఎస్‌సీ కార్డులకు 6,66,015 కిలోలు, ఎఫ్ఎస్‌సీ కార్డులకు 45,81,078 కిలోలు, ఏఏపీ కార్డులకు 2 వేల కిలోలు.. మొత్తం రేషన్ కార్డులకు మే నెలకుగానూ 52,49,093 కిలోలు బియ్యం కోటా విడుదలైంది. అలాగే నాగర్‌కర్నూల్ జిల్లాలో మొత్తం 558 రేషన్ దుకాణాలు ఉండగా.. 2,43,213 రేషన్ కార్డులు ఉండగా.. సభ్యులు 7,40,610 ఉన్నారు. వీరికి మే నెలలో 5,110.250 మెట్రిక్ టన్నులు పంపిణీ చేశారు. అలాగే జోగులాంబ గద్వాల జిల్లాలో మొత్తం 335 రేషన్ దుకాణాలు ఉండగా.. 1,57,434 కార్డుదారులు ఉన్నారు. వనపర్తి జిల్లాలో 325 దుకాణాలు ఉండగా.. కార్డుదారులు 1.53 లక్షల మంది కార్డుదారులు ఉండగా.. మొత్తం సభ్యులు 5 లక్షల మంది ఉన్నారు.

15 వేల మెట్రిక్ టన్నులు అవసరం

మహబూబ్‌నగర్ జిల్లా వ్యాప్తంగా 506 రేషన్ దుకాణాలు ఉన్నాయి. కార్డుదారులు 2,44,541 మంది ఉండగా సభ్యులు 8,18,004 మంది ఉన్నారు. వీరికి ప్రతి నెలా 5 వేల మెట్రిక్ టన్నుల బియ్యం కోటా విడుదల వుతున్నది. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి సన్న బియ్యం అందిస్తున్నారు. మే నెల కోటా సైతం పూర్తయ్యింది. వచ్చే మూడు నెలలకు సంబంధించిన బియ్యం కోటా విడుదల చేసేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఎఫ్‌సీఐలో నిల్వలను పరిశీలిస్తున్నారు. మూడు నెలలకు 15 వేల మెట్రిక్ టన్నులకు పైగా మహబూబ్‌నగర్ జిల్లాఅవసరమని అధికారులు అంచనా వేస్తున్నారు. ఇందుకు తగ్గట్లుగా స్టాక్ పంపించేందుకు చర్యలు చేపట్టారు.

పెద్ద మొత్తంలో స్టాక్ నిల్వ కష్టమే..

ఉమ్మడి పాలమూరు జిల్లాలోని చాలా రేషన్ దుకాణాల్లో చిన్నగా.. ఇరుకుగా ఉన్నాయి. అయితే కేంద్ర ప్రభుత్వం ఒకేసారి మూడు నెలల బియ్యం కోటా ఇవ్వనుండడంతో స్టాక్‌ను నిల్వ ఉంచడం కష్టమే అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇలాంటి దుకాణాల కోసం అధికారులు ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తున్నారు. ఇందుకు అవసరమైన ఏర్పాట్లను డీలర్లు చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. అయితే రేషన్ దుకాణాలకు అందించేం దుకు బియ్యం అందుబాటులో లేకున్నా.. పక్క జిల్లాల నుంచి తెప్పించేలా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని పాతపాలమూరులో ఇరుకుగా ఉన్న చౌకధర దుకాణం

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను కలిసిన ధన్వాడ మండల నాయకులు

అభివృద్ధి పనులపై పోరాటం చేయాలి

- కాంగ్రెస్ ప్రభుత్వ మోసపూరిత విధానాలను ప్రజలకు వివరించాలి
- పేట నాయకులకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు

ధన్వాడ, మే 20 : నారాయణపేట జిల్లాలో నిలిచిన అభివృద్ధి పనులు ప్రారంభించేందుకు ప్రభుత్వంపై పోరాటం చేయాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు పార్టీ నాయకులకు పిలుపునిచ్చారు. మంగళవారం హైదరాబాద్‌లో మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను ధన్వాడ మండలానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు కలిశారు. ఈ సందర్భంగా జిల్లాలో నిలిచిపోయిన అభివృద్ధి పనుల తోపాటు ప్రభుత్వం ధాన్యం కొనుగోళ్ల విషయంలో చేస్తున్న నిర్లక్ష్యాన్ని కేటీఆర్‌కు వివరించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతులు, ప్రజలకు ఇచ్చిన మోసపూరిత వాగ్దానాలను ఎక్కడికక్కడ ఎండగట్టి ప్రజలను చైతన్యం చేయాలని, నారాయణపేట నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. కేటీఆర్‌ను కలిసిన వారిలో బీఆర్ఎస్ నాయకులు గవినోళ్ల శ్రీనివాస్, భాస్కర్‌రెడ్డి, నారాయణస్వామి తదితరులు ఉన్నారు.

మిల్లర్ల దోపిడీని అరికట్టాలి

చీర్కపల్లిలో రైతు సంఘం ఆధ్వర్యంలో రాస్తారోకో చేస్తున్న రైతులు

- కొనుగోలు కేంద్రాల్లో లారీల కొరత తీర్చాలి
- ఏదుల మండలం చీర్కపల్లిలో రైతుల రాస్తారోకో

గోపాల్‌పేట, మే 20 : ధాన్యం కొనుగోళ్లలో మిల్లర్లు తరుగు పేరుతో చేస్తున్న దోపిడీని అరికట్టడంతో పాటులారీల కొరత తీర్చి కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే తరలించి రైతుల ఇబ్బందులు తొలగించాలని రైతు సంఘం జిల్లా నాయకులు బాల్‌రెడ్డి, ఎం శ్రీనివాసులు డిమాండ్ చేశారు. మంగళవారం వారు ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించి లారీల కొరతతో ధాన్యం కొనుగోళ్లు నిలిపివేయడంపై రైతులతో కలిసి ఏదుల మండలం చీర్కపల్లిలోని ప్రధాన రహదారిపై బైఠాయించి రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత పది రోజులుగా లారీల కొరత వల్ల 7,500 బస్తాల ధాన్యం కొనుగోలు కేంద్రంలో నిల్వ ఉండడంతో వాటిని కాపాడుకోవడం రైతులకు ఇబ్బందికరంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. రైస్ మిల్లర్లు జిల్లా వ్యాప్తంగా తరుగు, తాలు పేరుతో క్వింటాకు 3 కేజీల పైగా తరుగు తీస్తుండడం రైతులను దగా చేయడమేనని ఆరోపించారు. రైతులు తాము పండించిన పంటను అమ్ముకునేందుకు కూడా ఇన్ని ఇబ్బందులకు గురికావడం సరైన విధానం కాదన్నారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు సరైన సౌకర్యాలు కల్పించడంతో పాటు ప్రభుత్వమే ధాన్యం ఆరబెట్టేందుకు కవర్లు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. రైతుల రాస్తారోకో విషయం తెలుసుకున్న జిల్లా సివిల్ సప్లయ్, ఐకేపీ అధికారులు రైతులతో మాట్లాడుతూ తరుగు, తాలు పేరుతో జరుగుతున్న దోపిడీని అరికట్టేందుకు చర్యలు తీసుకుంటామని, ప్రతి కేంద్రానికి రోజుకు 3 లారీలు వచ్చే విధంగా చేస్తామని హామీ ఇవ్వడంతో వారు రాస్తారోకో విరమించారు. కార్యక్రమంలో శేఖర్, నరేశ్, మహేశ్, శివశంకర్, మైబూస్, రాములు, మల్లేశ్, కాశీం, శేషయ్య, సత్యనారాయణ, పర్వతాలు, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

గడువులోగా యూనిఫామ్స్ అందేనా..?

- బడులు తెరిచే నాటికి ఏకరూప దుస్తులు సిద్ధమయ్యేనా..
- జిల్లాలో 470 పాఠశాలల్లో 55,275 మంది విద్యార్థులు
- స్వయం సహాయక సంఘాలకు స్టిచ్చింగ్ బాధ్యతలు అప్పగింత

నేరడగంలో ఏకరూప దుస్తులు కుడుతున్న మహిళలు

మక్తల్, మే 20 : ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు అందించే ఏకరూప దుస్తులు బడులు పునఃప్రారంభిచే నాటికి అందుతాయా లేదా అనే సందేహాలు నారాయణపేట జిల్లాలో మొదలయ్యాయి. గత బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా విద్యాశాఖను పటిష్ట పరుస్తూ ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులను కల్పించడం తోపాటు, ప్రతి విద్యార్థికి ఉచిత యూనిఫాం, పాఠ్య, నోట్ పుస్తకాలను సరైన సమయం లోనే అందించింది. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో విద్యావ్యవస్థ రూపురేఖలు మారుస్తామని గొప్పలు చెప్పుకుంటూ పాఠశాలలో అమ్మ ఆదర్శ కమిటీలను ఏర్పాటు చేయడంతోపాటు మౌలిక సదుపాయాల కోసం ప్రత్యేక వైఖరి నిధులను కేటాయించినమంటూ గొప్పలు చెప్పుకుంటుందే తప్పా పాఠశాలల్లో మౌలిక సదుపాయాలను ఏర్పాటుచేసిన దాఖలు లేవని తేలిపోయింది. నారాయణపేట జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు బడి పునఃప్రారంభించే నాటికి యూనిఫాంలు అందించాలని అధికారులు విద్యార్థుల కొలతలు తీసుకొని జిల్లాలోని స్వయం సహాయక సంఘాలకు స్టిచ్చింగ్ చేసే బాధ్యతలను అప్పగించారు. నారాయణపేట జిల్లాలో 470 పాఠశాలల్లో 55,275 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. 25,469మంది బాలురు, 29,806మంది బాలికలకు మొత్తం 55,270 యూనిఫాంలు సిద్ధం చేయాల్సి ఉంది. ప్రభుత్వ పాఠశాలలో చదివే ప్రతి విద్యార్థికి రెండు జతల ఏకరూప దుస్తులను అందించే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ప్రభుత్వం నుంచి 2,35, 700 మీటర్ల బట్ట ఇదివరకే జిల్లా కేంద్రానికి రావడంతో అధికారులు స్వయం సహాయక సంఘాలకు స్టిచ్చింగ్ చేసేందుకు ఆయా మండలాలకు సరఫరా చేశారు. జిల్లా లో 822 స్వయం సహాయక సంఘాల్లోని 85, 210 మంది సభ్యులు ఉండగా జిల్లాలోని అన్ని మండల కేంద్రాల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో విద్యార్థులకు కావాల్సిన ఏకరూప దుస్తుల తయారీని అప్పజెప్పారు. గతేడాది స్వయం సహాయక సంఘాలకు పాఠశాల ఏకరూప దుస్తులు తయారీ అప్పగించడం వల్ల మొదటి జత దుస్తులను పాఠశాల తెరిచిన రెండు నెలలకు అప్పజెప్పి, రెండో జత బట్టలను మాత్రం అర కొరగా విద్యాసంవత్సరం ముగిసేంతవరకు ఇవ్వకపోవడంతో చాలామంది విద్యార్థులకు పాఠశాల ఏకరూప దుస్తులు లేక ఇబ్బందులు పడాల్సిన పరిస్థితిలో తలెత్తాయి. ప్రస్తుతం ఈ నూతన విద్యా సంవత్సరంలో పాఠశాల ప్రారంభం నాటికి ప్రతి విద్యార్థికి ఏకరూప దుస్తులు అందుతాయా లేదా వేచి చూడాల్సిందే.

స్టిచ్చింగ్ షురూ చేసిన స్వయం సహాయక సంఘాలు

2025-26 నూతన విద్యా సంవత్సరంలో విద్యార్థులకు ఏకరూప దుస్తులు అందించాలని లక్ష్యంతో స్వయం సహాయక సంఘాలు జిల్లాలోని ప్రతి మండలంలోని పాఠశాలల్లో దుస్తులను స్టిచ్చింగ్ చేసే పనిని ప్రారంభించాలి. యునిఫాంలు సమయానికి అందిస్తారా లేదా అనే అంశాన్ని ఆయా మండలాలకు చెందిన ఎంపీడీవో, ఎంఈవో, సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయులు యూనిఫాం స్టిచ్చింగ్ ఎంత వరకు వచ్చిందనే వివరాలను రోజువారీగా సమీక్షించి సభ్యులకు పని వేగవంతం చేయాలని సూచిస్తున్నారు. ఒక యూనిఫాం కుట్టేందుకు ప్రభుత్వం కూలి రూ.75 చెల్లిస్తుందని అధికారులు చెబుతున్నారు. ఒకటి నుంచి 5వ తరగతి బాలురకు నిక్కర్, షర్టు, ఒకటి నుంచి మూడో తరగతి చదివే బాలికలకు స్కర్ట్, 4, 5 తరగతులు చదివే బాలికలకు షర్టు, లహంగా, ఆరు నుంచి పదో తరగతి చదివే విద్యార్థినులకు పంజాబీ డ్రెస్‌లను ఇవ్వనున్నారు. గతేడాది మాదిరిగానే విద్యార్థులకు ఏకరూప దుస్తుల పంపిణీ ఆలస్యం అవుతుందా, లేక పాఠశాల తెలిసే నాటికి దుస్తులు సిద్ధంగా ఉంటాయా వేచి చూడాల్సిందే. అయితే జిల్లాలోని విద్యార్థులకు ఇప్పటికే 42శాతం దుస్తుల స్టిచింగ్ పూర్తయినట్లు సెక్టోరియల్ అధికారి చెప్పారు.

కేరళలో విద్యుదాఘాతంతో హాజీపూర్ మహిళ మృతి

- మృతదేహాన్ని సొంత గ్రామానికి తరలించిన శబరిమల ఆలయ బోర్డు

భారతమ్మ(ఫైల్)

అచ్చంపేటటౌన్, మే 20 : అచ్చంపేట మండలం హాజీపూర్ గ్రామానికి చెందిన మహిళ విద్యుదాఘాతంతో సోమవారం కేరళలోని శబరిమలలో మృతి చెందింది. అచ్చంపేట అయ్యప్ప సేవా సమితి అధ్యక్షుడు కపిలవాయి మహేశ్‌చారి తెలిపిన వివరాల ప్రకారం అచ్చంపేట మండలంలోని హాజీపూర్ గ్రామానికి చెందిన భారతమ్మ (60) సోమవారం శబరిమల ఆలయం నుంచి కిందకు వస్తుండగా విద్యుదాఘాతంతో మృతి చెందినట్లు తెలిపారు. ట్రావెల్స్‌లో 40 మంది సభ్యుల బృందం శబరిమల నీలిమల మీదుగా ఆలయ సందర్శన నుంచి పంబా వద్ద తిరిగి వస్తుండగా ఈ ఘటన చోటు చేసుకుందన్నారు. విషయం తెలిసిన వెంటనే అఖిల భారత అయ్యప్ప సేవా సమితి అధ్యక్షుడు నాయిని బుచ్చిరెడ్డికి సమాచారం అందించగా స్పందించి ఆయన ఆమె మృతదేహాన్ని పతనం తిట్ల ప్రభుత్వ ఆసుపత్రి తరలించినట్లు తెలిపారు. అనంతరం శబరిమల దేవస్థానం బోర్డు వారి సహకారంతో అంబులెన్స్‌లో మృతదేహాన్ని హాజీపూర్ గ్రామానికి తరలించినట్లు పేర్కొన్నారు.

సాగు నీటి ప్రాజెక్టు పనులు వేగవంతం చేయాలి

మాట్లాడుతున్న ఉమ్మడి జిల్లా ప్రత్యేకాధికారి రవినాయక్

- ఉమ్మడి జిల్లా ప్రత్యేకాధికారి రవినాయక్

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, మే 20 : జిల్లాలో నిర్మాణంలో ఉన్న సాగునీటి ప్రాజెక్టులు, ఎత్తిపోతల పథకాల భూ సేకరణ, పునరావాస పనులు వేగవంతం చేయాలని ఉమ్మడి జిల్లా ప్రత్యేకాధికారి జి.రవినాయక్ అధికారులను ఆదేశించారు. మంగళవారం సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయం (కలెక్టరేట్)లోని వీసీహాల్‌లో కలెక్టర్ విజయేందిర బోయితో కలిసి పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగంగా నిర్మిస్తున్న ఉదండాపూర్ రిజర్వాయర్ నిర్మాణం, భూ సేకరణ, ఆర్‌అండ్‌ఆర్ పనులను, కోయిల్‌సాగర్, మహాత్మాగాంధీ ఎత్తిపోతల పథకాల భూసేకరణపై ఇరిగేషన్, రెవెన్యూ, విద్యుత్, మిషన్ భగీరథ, సర్వేల్యాండ్ రికార్డ్స్ శాఖల అధికారులతో సమీక్షించారు. నిర్వాసిత కుటుంబాలకు పునరావాసం, కల్పిస్తున్న సౌకర్యాలు వసతులకు సంబంధించిన వివరాలు సేకరించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ మోహన్‌రావు, సాగునీటి పారుదల శాఖ చీఫ్ ఇంజినీర్ రమణారెడ్డి, ఎస్ఈ చక్రధరం, ఆర్డీవో నవీన్, సర్వే ఏడీ కిషన్‌రావు, మిషన్ భగీరథ(ఇంట్రా) ఈఈ పుల్లారెడ్డి పాల్గొన్నారు.

కన్నతల్లి కర్కశత్వం

- కూతురిని నీటి సంపులో పడేసిన తల్లి
- గతంలో భర్తనూ హత్య చేసిన వైనం

మేకల నవిత (ఫైల్)

లింగాల, మే 20 : నవమాసాలు మోసి జన్మనిచ్చి తల్లి కన్నకూతురిపై కర్కశంగా వ్యవహరించి నీటి సంపులో పడేసి హతమార్చిన ఘటన నాగర్‌కర్నూల్ జిల్లా లింగాల మండలం చెన్నంపల్లిలో సోమవారం అర్ధరాత్రి చోటు చేసుకున్నది. ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని చెన్నంపల్లి గ్రామానికి చెందిన మేకల రాములు, ఎల్లమ్మ దంపతులకు ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నారు. రెండో కూతురు అయిన మేకల నవిత (6)ను గాఢనిద్రలో ఉండగా తల్లి ఎల్లమ్మ ఎత్తుకొని వెళ్లి ఇంటి పక్కనే ఉన్న బొగ్గుల తిరుపతయ్యకు చెందిన నీటి సంపులో పడేసింది. గమనించిన బాలిక చిన్నాన్న సంపులో నుంచి చిన్నారిని బయటకు తీయగా అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. మేకల ఎల్లమ్మ గత ఐదు నెలల కిందట భర్త మేకల రాములును గొడ్డలితో నరికి హత్య చేసి జైలుకు వెళ్లింది. ఆమె రెండు నెలల కిందట బెయిల్‌పై బయటకు వచ్చినట్లు చెప్పారు. అత్తామామలు కేసు పెట్టి జైలుకు పంపారని ప్రతి రోజూ శాపనార్థాలు పెడుతుండేవని, ఈ విషయాలన్నీ మేకల నవిత నానమ్మ, చిన్నాన్నలకు చాడీలు చెబుతుందన్న కోపంతో కూతురును నీటి సంపులో పడవేసి హతమార్చిందన్నారు. మృతురాలు నానమ్మ మాసమ్మ ఫిర్యాదు మేరకు అచ్చంపేట సీఐ రవీందర్ పర్యవేక్షణలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ప్రకృతి వనం.. కళావిహీనం

- పల్లెల్లో కనుమరుగవుతున్న ప్రకృతి వనాలు
- నీరులేక ఎండుతున్న మొక్కలు
- పట్టించుకోని సంబంధిత శాఖ అధికారులు
- నీరుగారుతున్న నిర్వహణ

గద్వాల, మే 20 : కేసీఆర్ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి రాష్ట్రంలో అడవుల శాతాన్ని పెంచడంతో పాటు కాలుష్య నివారణ కోసం హరితహారం చేపట్టి కోట్ల మొక్కలు నాటింది. దీంతోపాటు పల్లె ప్రజలు సేద తీరడానికి నర్సరీతోపాటు పల్లెప్రకృతి వనాలు ఏర్పాటు చేశారు. వీటిల్లో లక్షలాది మొక్కలు నాటారు. ఆహ్లాదకర వాతావరణం అందించాలనే ఉద్దేశంతో వాటిని పర్యవేక్షిస్తూ వచ్చింది. నాడు ఎక్కడ చూసినా చెట్లు, మొక్కలతో పచ్చదనం పరిఢవిల్లింది. కానీ ప్రస్తుత ప్రభుత్వం వాటి నిర్వహణను గాలి కొదిలేసింది. అధికారంలోకి వచ్చిన నాటి నుంచి పట్టించుకోకపోవడంతో నిర్వహణ అస్తవ్యస్తంగా తయారైంది. కాగా సర్పంచుల పదవీ కాలం ముగిసి పోవడంతో వాటి నిర్వహణపై జీపీ అధికారులు చేతులెత్తేశారు. రూ.లక్షలు పోసి లక్షల మొక్కలు పెంచితే ప్రస్తుతం వాటికి నీరు పోసే నాథుడే కరువయ్యాడు. దీంతో నాడు స్వచ్ఛమైన గాలినిచ్చిన వనాలు నేడు నిర్వాహణ లోపంతో కళావిహీనంగా మారాయి.

గద్వాల జిల్లాలో ఇలా..

జోగులాంబ జిల్లాలోని 13 మండలాల్లో 60 బృహత్ పల్లెప్రకృతి వనాల ఏర్పాటుకు అధికారులు భూ మిని గుర్తించారు. అందులో 57వనాల్లో మొక్కలు నాటారు. వనాలను కొన్నింటిని 10 ఎకరాల్లో ఏర్పాటు చేయగా.. భూమి తక్కువగా ఉన్న చోట ఐదు నుంచి ఎనిమిది ఎకరాల్లో ఏర్పాటు చేశారు. వీటిలో సుమారు 2,98,300 మొక్కలు నాటినట్లు అధికారుల లెక్కలు ఉన్నాయి. ఇందులో మామిడి, జామ, దానిమ్మ, ఉసిరి, అల్లనేరేడు, వేప, కానుగ, సీతాఫలం తోపాటురకాల మొక్కలు నాటారు. ఒక్కో ప్రకృతి వనానికి రూ.20 లక్షల నుంచి రూ.40 లక్షల వరకు ఖర్చు చేశారు. మొక్కల సంరక్షణకు కంచెను ఏర్పాటు చేసి నీరు పోయడానికి ఉపాధి హామీ పథకం నుంచి వాచర్లను నియమించారు. పిచ్చి మొక్కలను తొలగించడం.. ఇతర పనులు చేయించారు. రెండేళ్ల పాటు పచ్చదనంతో కళకళలాడిన వనాల్లోని మొక్కలన్నీ ఎండిపోతున్నాయి. జిల్లాలోని 255 పంచాయతీల్లో 296 చోట్ల ప్రకృతి వనాలు ఏర్పాటు చేశారు. వీటిలో 6,11, 027 మొక్కలు నాటారు. ఒక్కో వనం ఏర్పాటు చేయడానికి సుమారు రూ.4 లక్షలపైనే ఖర్చు చేశారు. వీటి పరిస్థితి కూడా ప్రస్తుతం అంతే ఉన్నది. గద్వాల నియోజకవర్గంలోని గట్టు, ధరూర్, గద్వాల, కేటిదొడ్డి, అలంపూర్ నియోజకర్గంలోని అయిజ, మానవపాడు, ఉండవెల్లి, అలంపూర్ మండలాల్లో వనాలు ఎండిపోవడంతో నాటి ప్రభుత్వ లక్ష్యం నీరుగారుతున్నది. కేసీఆర్ మంచి ఆలోచనతో వీటిని ఏర్పాటు చేస్తే ప్రస్తుత సీఎం వాటిని గాలి కొదిలేశారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అధికారులు స్పందించి పల్లె, బృహత్ ప్రకృతి వనాలకు నీటి సౌకర్యం కల్పించి చెట్లు ఎండిపోకుండా చూడాల్సిన ఉన్నది.

అకాల వర్షాలకు తడిసిన ధాన్యం

- లారీలు లేక కొనుగోలు కేంద్రాల వద్దే నిల్వ
- దిక్కుతోచని స్థితిలో రైతులు

లింగాల కొనుగోలు కేంద్రం వద్ద లారీలు రాక నిల్వ చేసిన ధాన్యంపై కప్పిన కవర్లు

లింగాల, మే 20 : ఆరుగాలం కష్టపడి పండించిన వరి ధాన్యం అకాల వర్షాలతో తడిసి ముద్దవుతున్నాయి. ధాన్యాన్ని కేంద్రాలకు తరలించగా, కొనుగోలు ఆలస్యం కావడంతో అకాల వర్షాలకు వరిధాన్యం తడిసి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. మండలంలో 8 కొలుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినా ధాన్యం కొనుగోలులో వేగం లేని కారణంగా రోజుల తరబడి వేచి ఉండాల్సిన దుస్థితి నెలకొచ్చిన తేమ శాతం పేరుతో రైతులను ముప్పతిప్పలు పెడుతున్నారు. ధాన్యాన్ని ఆరబెట్టినా గన్నీ బ్యాగులు కొరత సృష్టిస్తున్నారు. అరకొరగా బ్యాగులిచ్చి కొనుగోలు చేసినా లారీలకు ఎత్తడం లేదు. బీఆర్ఎస్ హయాంలో ఎప్పుడూ కొనుగోళ్లలో ఇబ్బందులు రాలేదని, సమయానికి కొనుగోలుచేసేవారని రైతులు గుర్తుచేస్తున్నారు. కాంగ్రెస్ సర్కారు వచ్చాక రైతును ముంచుతున్నారని మండిపడ్డారు. ఈ విషయమై సింగిల్ విండో సీఈవో పాండును వివరణ కోరగా మండలంలో 8 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి 12,966 క్వింటాళ్ల సన్న, దొడ్డు రకం వరిధాన్యం కొనుగోలు చేశామన్నారు. ఇప్పటి వరకు 5,560 క్వింటాళ్ల ధాన్యాన్ని తరలించాం. 7,406 క్వింటాళ్ల ధాన్యం నిల్వ ఉన్నది. లారీల కొరత కారణంగా నిల్వ ఉన్న ధాన్యాన్ని తరలించలేకపోయామన్నారు.

12 రోజులైనా కొంటలేరు..

ధాన్యాన్ని కేంద్రానికి తీసుకొచ్చి 14 రోజులు అవుతుంది. తూర్పార పడితేగానీ కాంటాకు ధాన్యం వేయమని నిర్వాహకులు చెబుతున్నారు. తూర్పార పట్టినా హమాలీలు లేరని, గన్నీ బ్యాగులు లేవని ఇబ్బందులు పెడుతున్నారు. చివరకు కాంటా వేసిన ధాన్యాన్ని తీసుకెళ్లడానికి సకాలంలో లారీలు రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. – కేతావత్ శివరాం, రైతు లింగాల



గద్వాల మండలం వీరాపురంలో ఎండిన మొక్కలు



గట్టులో నిర్వహణ లోపంతో ఎండిన మొక్కలు



ధరూర్‌లో ఎండిపోతున్న మొక్కలు